ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 81 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి గురువారం 23 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02




2వ పేజీలో

## ఏపీ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత

- హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో నాదెండ్ల భాస్కరరావు మృతి
- వృద్ధాప్య సమస్యలతో చికిత్స పొందుతూ కన్నుమూత
- 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కరరావు
- సాయంత్రం 4 గంటలకు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు
- 1984లో నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల
- హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో కన్నుమూత
- నాదెండ్ల మనోహర్‌ను ఫోన్‌లో పరామర్శించిన ముఖ్యమంత్రి
- కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసిన చంద్రబాబు
- ఉదయం హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచిన భాస్కరరావు
- నాదెండ్ల భాస్కరరావు మరణం రాష్ట్రానికి తీరని లోటు: జగన్

## నేడే అసెంబ్లీ ఎన్నికల సమరం

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం
రాష్ట్రవ్యాప్తంగా 234 స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు
5.73 కోట్ల మంది ఓటర్లు.. 4,023 మంది అభ్యర్థులు
డీఎంకే, అన్నాడీఎంకే కూటముల మధ్యే ప్రధాన పోటీ
విజయం డీఎంకే కూటమిదేనంటున్న సర్వేలు
దళపతి విజయ్ పార్టీ 8--10 స్థానాలకే పరిమితం!
నేడు బెంగాల్‌లో తొలి దశ పోలింగ్
అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల కమిషన్
2,450 కంపెనీల కేంద్ర బలగాల మోహరింపు
బీజేపీకి కీలకంగా మారిన ఉత్తర బెంగాల్
పట్టు నిలుపుకునేందుకు టీఎంసీ యత్నం
బరిలో పలువురు ప్రముఖులు

2వ పేజీలో



## కదలని చక్రాలు

2వ పేజీలో

డిపోలకే పరిమితమైన బస్సులు
రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ సమ్మె
తొలిరోజు విజయవంతం
రాజకీయపార్టీలు, కార్మిక సంఘాల మద్దతు
కరీంనగర్‌లో రోడ్డు ప్రమాదం
సర్కార్ కుయుక్తులు..తప్పుకున్న సూపర్‌వైజర్ల సంఘం
ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో సర్వీసుల పెంపు
సమస్యలు పరిష్కరించి సమ్మె నివారించాలి : సీఐటీయూ
సీఎం స్పందించాలి: జేఏసీ
సమ్మె విరమించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్
సమ్మె వద్దు..మాయమాటలు నమ్మొద్దు: ఎండీ నాగిరెడ్డి
బెదిరింపులకు ఖండన: కూనంనేని సాంబశివరావు

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె తొలిరోజు విజయవంతమైంది. సర్కారుతో చర్చలు విఫలమైన నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి నుంచే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్రంలోని 97 బస్ డిపోల్లో వేలాదిగా ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారు.

## నౌకలపై ఇరాన్ దాడి

- మూడింటిపై దాడిచేసి రెండింటిని స్వాదీనం చేసుకున్న ఐఆర్‌జీసీ
- కాల్పుల విరమణ గడువును పొడిగించిన డొనాల్డ్ ట్రంప్
- హార్మూజ్ దిగ్బంధనం కొనసాగుతుందన్న అమెరికా అధ్యక్షుడు
- ఈ ప్రకటన వెలువడ్డ కొన్ని గంటలకే నౌకల ఆక్రమణకు తెరలేపిన ఇరాన్
- భారత్‌కు రావాల్సిన నౌక పైనా ఇరాన్ కాల్పులు
- కాల్పుల విరమణ గడువు పొడిగింపుపై పాక్ హర్షం
- వాయిదాపడిన రెండో దఫా చర్చలు
- ముంద్రా పోర్టుకు వస్తుంటే మెరుపుదాడి
- గడువు పెంపుపై పెదవి విరిచిన ఇరాన్
- క్షిపణుల ప్రదర్శన
- సముద్ర ఇంటర్నెట్ కేబుళ్లు కత్తిరిస్తాం: ఇరాన్
- ఎలాంటి చెల్లింపులు జరపలేదు




2వ పేజీలో

పాక్ ప్రాయోజిత శాంతి చర్చల ప్రక్రియకు తూట్లు పొడుస్తూ ఇరాన్ హార్మూజ్ జలసంధిని మరోమారు కాల్పులమోతకు వేదికగా మార్చేసింది. శాంతి చర్చలకు ఫలవంతమైన ప్రతిపాదనలతో ఇరాన్ వచ్చేవరకు కాల్పుల విరమణ గడువును పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపటికే విదేశీ నౌకలపై ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) నేవీ బలగాలు దాడులపర్వానికి తెరలేపాయి. ఇటీవల కొన్ని గంటలపాటు హార్మూజ్‌ను పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ చేసిన ప్రకటనతో పర్షియన్ గల్ఫ్ నుంచి ఆశగా బయల్దేరిన నౌకలు గురువారం హార్మూజ్ జలసంధిని దాటే క్రమంలో వాటిపైకి ఐఆర్‌జీసీ నేవీ గన్‌బోట్లు తుపాకులు ఎక్కుపెట్టాయి. దీంతో మూడు నౌకలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. మూడింటిలో రెండింటిని ఇరాన్ స్వాధీనంచేసుకుని

## “మీరు భయపడుతున్నారు”

**సీఎం చంద్రబాబుపై జగన్ సంచలన వ్యాఖ్యలు..!**

సీఎం చంద్రబాబు ఇటీవల మీరు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే మీరు బాగా భయపడిపోతున్నారని అర్థమవుతోందని మాజీ వైఎస్ సీఎం జగన్ అన్నారు. ఎన్నికల ముందు అధికారం కోసం నోటికి వచ్చిన వాగ్దానాలు ఇచ్చారని.. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ ప్రతి సభలోనూ ఊదరగొట్టారన్నారు. బాండ్లు సైతం ప్రతి ఇంటికీ వెళ్లి ఇచ్చి ప్రతి కుటుంబాన్ని మోసం చేశారన్నారు. రెండేళ్లు అవుతున్నా మేనిఫెస్టోలో చెప్పినవి ఏవీ చేయకపోగా, సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అమలు చేసేశామని పచ్చి అబద్ధాలు కూడా చెబుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రజల నుంచి, ఉద్యోగుల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక ప్రశ్నించే గొంతుకలపై బ్రహ్మాస్త్రాలు ప్రయోగిస్తున్నారని తెలిపారు.





2వ పేజీలో

## నెలలోగా వైద్య కళాశాలలు ప్రారంభించాలి

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- సంజీవని ప్రాజెక్టు, పాపులేషన్ మేనేజ్‌మెంట్ సీఎం చంద్రబాబు సమీక్ష
- నెలలోగా పీపీపీ వైద్య కళాశాలలు పట్టాలెక్కాలని సంతానోత్పత్తి రేటు 2.1 చేరుకోవడమే లక్ష్యం కావాలని అధికారులకు ఆదేశం
- వ్యాధులు నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్
- జనాభా సంరక్షణ దిశగా అడుగులు

రాష్ట్రంలో పీపీపీ విధానంలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కాలేజీల పనులు నెల రోజుల్లో ప్రారంభించేలా ఆయా సంస్థలకు అప్పగించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ముందుగా ఫేజ్-1లోని 4 మెడికల్ కాలేజీలు మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని పనులు మొదలు పెట్టాలని సూచించారు. ఫేజ్-2లో అమలాపురం, బాపట్ల, పెనుకొండ, నర్సీపట్నం, పాలకొల్లు, పార్వతీపురం మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పిల్లర్లతో ఏపీ స్టేట్ హెల్త్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ 2026-31 త్వరలోనే తీసుకురావాలని నిర్దేశించారు.

## హైకోర్టు సీజేగా జస్టిస్ లీసా గిల్

రాష్ట్రపతి ఉత్తర్వులు.. నోటిఫై చేసిన కేంద్రం
ఈ నెల 25న ప్రమాణం చేయించనున్న గవర్నర్
ఏపీ హైకోర్టు తొలి మహిళా సీజేగా రికార్డు
ప్రస్తుత సీజే జస్టిస్ ఠాకూర్ 24న పదవీ విరమణ

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ నియమితులయ్యారు. ఈ మేరకు భారత రాష్ట్రపతి ముర్ము ఉత్తుర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జస్టిస్ గిల్ నియామకాన్ని నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయ శాఖ సంయుక్త కార్యదర్శి జగన్నాథ్ శ్రీనివాసన్ బుధవారం నోటిఫికేషన్ ఇచ్చారు.



2వ పేజీలో

# నెలలోగా వైద్య కళాశాలలు ప్రారంభించాలి

సచివాలయంలో సంజీవని ప్రాజెక్టు, పాపులేషన్ మేనేజ్మెంట్‌పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ, ఆర్థిక, స్వర్ణ గ్రామ- స్వర్ణ వార్డు శాఖ, కార్మిక, మహిళా శిశు సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఏపీ స్టేట్ హెల్త్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీలో భాగంగా మెడికల్ కాలేజీలు, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, మెడ్ టెక్ ఉత్పాదనలు, స్టార్టప్-ఇన్నోవేషన్, మెడికల్ టూరిజం కింద ఇంటిగ్రేటెడ్ వెల్నెస్ ఫెసిలిటీస్ అందించడం, స్కిల్లింగ్, అమరావతి-వీఈఆర్‌లో మెడిసిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అమరావతిలో నేచరోపతి సంస్థ కేంద్ర నెలకొల్పేలా ఆయుష్ శాఖ మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలని నిర్దేశించారు. ప్రజలకు వైద్య ఖర్చులు భారం తగ్గించేలా ప్రివెంటివ్ హెల్త్ విధానం, సిటిజెన్ హెల్త్ స్క్రీనింగ్‌పై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.

వ్యాధులు నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్: ఇందుకోసం పబ్లిక్ హెల్త్ డేటాను వినియోగించుకోవాలని సీఎం అన్నారు. సంజీవని ప్రాజెక్టు కింద ఇప్పటివరకు 1.08 లక్షల మందికి వైద్య సేవలు పొందారని, 2.8 లక్షల మందికి మందులు పంపిణీ చేయగా, 19 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాజెక్టు వేగంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రభుత్వ సేవల్ని డిజిటలైజ్ చేసినా క్షేత్రస్థాయిలో సిబ్బంది ఆశించిన స్థాయిలో పనిచేయకుంటే ఫలితాలు రావని దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేశారు. ప్రజారోగ్య రక్షణకు సంబంధించి ప్రచారం జరగడం లేదని ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్య సమస్యలు తగ్గించుకునేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. అనీమియా, డయాబెటిస్ వంటి వ్యాధులు నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉందన్నారు.

జనాభా సంరక్షణ దిశగా అడుగులు: జనాభా నియంత్రణ నుంచి జనాభా సంరక్షణ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 2.1 నుంచి 1.5కి తగ్గిందని, అత్యధికంగా కడప జిల్లాలో 1.99 ఫెర్టిలిటీ రేటు ఉంటే, అత్యల్పంగా 1.32 విశాఖపట్నంలో నమోదైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఫెర్టిలిటీ రేటు 2.1 లక్ష్యంగా ముందుకు వెళ్లాలని లక్ష్యం కన్నా 6 శాతం తక్కువలో ఉన్నామని సీఎం స్పష్టం చేశారు. తల్లికి వందనం పాపులేషన్ మేనేజ్మెంట్ కార్యక్రమంలో భాగమేనని చెప్పారు. మన దేశ కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందని దీనిని కాపాడుకునేందుకు మైక్రో ఫ్యామిలీ సంస్కృతి విస్తరించకుండా చూడాలన్నారు. జనాభా నిర్వహణ అంశాన్ని కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. పాపులేషన్ మేనేజ్?మెంట్‌తో పాటు ప్రజారోగ్య రక్షణకు కార్యాచరణ చేపట్టాలన్నారు. సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వల్ల ఎక్కువ మంది అనారోగ్యం పాలవుతున్నారని, పోషకాహారం-ప్రివెంటివ్ హెల్త్ పై దృష్టి పెట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆయుర్వేద, నేచురోపతి చికిత్సా విధానాలను కూడా ప్రోత్సహించాలని సూచించారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా ఆస్పత్రులకు వచ్చిన రోగులకు వారి రికార్డుల ఆధారంగా డైట్ ప్యాట్రన్, పోషకాహారం అందించాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

# ఏపీ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత

* నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సంతాపం తెలిపిన జగన్
* ఏపీ రాజకీయాల్లో నాదెండ్లది విశిష్ట స్థానమని కితాబు
* ఆయన రాజకీయ అనుభవం తరతరాలకు ఆదర్శమని వ్యాఖ్య

సీనియర్ రాజకీయవేత్త, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కరరావు వృద్ధాప్య సమస్యలతో తుదిశ్వాస విడిచారు. నాదెండ్ల భాస్కర్‌రావు 1935 జూన్ 23లో గుంటూరులో జన్మించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అతి తక్కువ కాలం ముఖ్యమంత్రిగా నాదెండ్ల భాస్కరరావు పనిచేశారు. 1984 ఆగస్టు 16 నుంచి సెప్టెంబరు 16 వరకు 31 రోజులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు నాదెండ్ల భాస్కరరావు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 31 రోజుల పాటు సీఎం పీఠంపై కూర్చున్నప్పటికీ తెలుగుదేశం పార్టీ రాజకీయ చరిత్రలో నిలిచిపోయే 'ఆగస్టు సంక్షోభం'లో అతను కీలక పాత్రధారి. అప్పట్లో ఎన్టీఆర్ వెన్నంటే ఉండి, ఆపై ఆయనకే సవాల్ విసిరిన వైనం నేటికీ చర్చనీయాంశమే.

రాజకీయాల్లో కీలక పాత్ర: 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కరరావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై, మర్రి చెన్నారెడ్డి, అంజయ్య మంత్రివర్గాల్లో కీలక శాఖలను నిర్వహించారు. 1982లో నందమూరి తారక రామారావు 'తెలుగుదేశం' పార్టీని స్థాపించినప్పుడు భాస్కరరావు కీలక పాత్ర పోషించారు. 1983 ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించాక, ఎన్టీఆర్? కేబినెట్‌లో ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

ఎన్టీఆర్ టెక్సాస్‌లో గుండె శస్త్రచికిత్స చేయించుకుని తిరిగి వచ్చిన వేళ రాష్ట్ర రాజకీయాలు అనూహ్య మలుపు తిరిగాయి. కాంగ్రెస్ మద్దతుతో 1984 ఆగస్టు 16న భాస్కరరావు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సరిగ్గా నెల రోజులకే పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. తిరిగి కాంగ్రెస్‌లో చేరి 1998లో ఖమ్మం ఎంపీగా గెలుపొందారు. 2019లో ఆయన బీజేపీలో చేరారు. ప్రస్తుతం ఆయన వారసుడిగా నాదెండ్ల మనోహర్ ఏపీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అభిమానులు అంతిమ నివాళులు అర్పించుకోవడానికి వీలుగా, ఆయన పార్థివ దేహాన్ని జూబిలీహిల్స్ లోని వారి స్వగృహం వద్ద ఉంచనున్నారు. గురువారం (ఏప్రిల్ 23, 2026) మధ్యాహ్నం 4 గంటలకు పంజాగుట్ట, హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు.

మంత్రుల సంతాపం: నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్? సహా మంత్రులు సంతాపం తెలిపారు. భాస్కర్‌రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానన్న సీఎం చంద్రబాబు, అతని కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఫోన్‌లో పరామర్శించారు. న్యాయవాది, రాజకీయవేత్తగా ఆయనకున్న పరిజ్ఞానం ఎంతో విలువైందన్న పవన్, పితృవియోగం బాధ నుంచి నాదెండ్ల మనోహర్ త్వరగా కోలుకోవాలని ఆయన కోరుకున్నారు.

# కదలని చక్రాలు

సమ్మెకు ప్రభుత్వ మే కారణమనీ, అనివార్యమైందని ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు సర్కారు కుయుక్తులు పన్నుతున్నట్టు తెలిపింది. సూపర్‌వైజర్ల సంఘాన్ని సమ్మె నుంచి విరమింపజేసిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. అన్నీ డిపోల ఎదుట ఆయా సంఘాల నేతలు, కార్యకర్తలు ప్రభుత్వ వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. డ్రైవర్లు, కండక్టర్లు, ఇతరులు సమ్మెలోకి వెళ్లిన నేపథ్యంలో రోడ్లన్నీ కళతప్పాయి. ఒకవైపు ఇదంతా జరుగుతుండగానే మరోవైపు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి సమ్మె చట్టవిరుద్ధమని ప్రకటించారు. ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలనీ, కార్పొరేషన్‌లో కార్మిక సంఘాలను అనుమతించాలనీ, ట్రేడ్ యూనియన్ల కార్యకలాపాలపై ఆంక్షలు ఎత్తివేయాలనీ, విద్యుత్ బస్సుల కొనుగోలు, నిర్వహణ ఆర్టీసీ సంస్థే నిర్వ హించాలనీ, ఆర్టీసీని పరిరక్షించాలనీ, పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 17 డిపోల్లోని కార్మికులు దాదాపు 35వేల మందికిపైగా సమ్మెలో పాల్గొ న్నారు. సమ్మె నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్, సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్టాండ్లతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి రీజియన్లల్లో ఆర్టీసీ బస్టాండ్లు, డిపోలు బోసి పోయాయి. ఆర్టీసీ జేఏసీ నేతలంతా ఆయా డిపోల్లో సమ్మెలో పాల్గొన్నారు. బుధవారం నగరం లోని గన్‌పార్క్ సందర్శించి అమర వీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడారు. మరోపక్క ప్రభుత్వం అనుభవం లేని డ్రైవర్లతో బస్సులను నడిపే ప్రయత్నం చేసింది. అలాగే డిపోల వద్ద పోలీసు పహారా మధ్య ఆర్టీసీ బస్సులను జిల్లాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేసింది. కరీంనగర్‌లో ఈ తరహా ప్రయత్నం వికటించింది. బస్సు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు.

**ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో సర్వీసుల పెంపు**

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో సర్వీసులను పెంచింది. అదనపు ట్రిప్పులు వేయాలని నిర్ణయించింది. బుధవారం నగరంలోని మెట్రో సర్వీ సులన్నీ కిక్కిరిసిపోయాయి. మియాపూర్-ఎల్బీనగర్ కారిడార్‌లో సాధారణంగా పీక్ అవర్స్‌లో మూడు నిమిషాల 40సెకన్లకు ఒక రైలు, నాన్‌పీక్‌లో నాలుగు నిమిషాల 50 సెకన్ల కు ఒక రైలు నడిచేది. ఇప్పుడు నాలుగు నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు చొప్పున రోజంతా నడపనున్నారు. ఇకపోతే నాగోల్-రాయదుర్గ్ కారిడార్‌లో సాధారణంగా నాన్ పీక్‌లో ఐదు నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు నడిచేది. ఇప్పుడది మూడు 40 నిమిషాలకు ఒక రైలును నడపాలని మెట్రో అధికారులు నిర్ణయించారు. అంతేకాకుండా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాత్రి 11 గంటల తర్వాత కూడా సర్వీసులు పొడిగించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్టు మెట్రో ఎండీ ప్రకటించారు.

# హైకోర్టు సీజేగా జస్టిస్ లీసా గిల్

ఈ నెల 25 నుంచి ఆమె నియామకం అమల్లోకి వస్తుందని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నియామకంతో ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ చరిత్ర సృష్టించారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఈ నెల 24న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో జస్టిస్ లీసా గిల్ సీజేగా నియమితులయ్యారు. జస్టిస్ గిల్ ప్రస్తుతం హైకోర్టులో నెంబర్ 2గా కొనసాగుతున్నారు. పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ గిల్.. గత నెల 6న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ప్రస్తుత సీజే జస్టిస్ ఠాకూర్ పదవీ విరమణ అనంతరం జస్టిస్ గిల్‌ను సీజేగా ప్రతిపాదిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం గతంలోనే సిఫారసు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 25న సీజేగా ఆమెతో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయిస్తారు.

**ఇదీ జస్టిస్ లీసా గిల్ నేపథ్యం**

1966 నవంబర్ 15న జన్మించారు. చండీగఢ్‌లోని సెక్టార్ 9లో ఉన్న కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పాఠశాల విద్య పూర్తి చేశారు. హ్యుమానిటీస్ విభాగంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీఏ, ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 1990లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. పంజాబ్, హర్యానా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. క్రిమినల్, సివిల్, సర్వీస్, రెవెన్యూ, రాజ్యాంగ పరమైన అనేక రకాల కేసులను ఆమె వాదించారు. చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతంతో పాటు పలు బోర్డులు, కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం వహించారు. 2014 మార్చి 31న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

# నౌకలపై ఇరాన్ దాడి

తమ తీరానికి తీసుకెళ్తున్నాయి. మరోవైపు ఇరాన్ ప్రతినిధి బృందం ఇస్లామాబాద్‌కు బయల్దేరని కారణంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సారథ్యంలోని బృందం సైతం పాకిస్తాన్‌కు బయల్దేరలేదు. దీంతో రెండో దఫా చర్చలు సాధ్యపడలేదు. అయితే చర్చలు తాత్కాలికంగా వాయిదాపడ్డాయేగానీ రద్దుకాలేదని అమెరికా వ్యాఖ్యానించింది. శుక్రవారంలోపు రెండోదఫా చర్చలు జరిగే వీలుందని ట్రంప్ చెప్పినట్లు 'ది న్యూయార్క్ పోస్ట్'తన కథనంలో పేర్కొంది. మరోవైపు బుధవారంతో ముగిసిపోతున్న కాల్పుల విరమణ గడువును ట్రంప్ హఠాత్తుగా పొడిగించడంపై మధ్యవర్తిత్వ దేశం పాకిస్తాన్ హర్షం వ్యక్తంచేసింది. సత్ఫల ప్రతిపాదనలతో ముందుకొచ్చేలా ఇరుపక్షాలను ఒప్పించేందుకు తమకు గడువు, సువర్ణావకాశం దక్కాయని పాకిస్తాన్ వెల్లడించింది. "మా దాడుల ధాటికి ఇరాన్ నాయకత్వంలో విభేదాలు పొడచూపాయి. పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిం మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు ఇరాన్‌పై దాడులకు తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నా. ఇరాన్ నుంచి ఆమోదయోగ్య ప్రతిపాదనలు వచ్చేదాకా కాల్పుల విరమణ గడువు పొడిగిస్తున్నా. గడువు పొడిగించినా హార్మూజ్ దిగ్బంధం, ఇరాన్ నౌకాశ్రయాల గుండా నౌకల రాకపోకలపై నిషేధం కొనసాగుతుంది"అని ట్రంప్ అన్నారు. రెండో దఫా చర్చలు జరిగి శాశ్వత శాంతి ఒప్పందం అమల్లోకి వస్తే హార్మూజ్ తెరచుకుని ముడిచమురు సంక్షోభం సమసిపోయి క్రూడ్ ఆయిల్, పెట్రో ధరలు దిగొచ్చేవి. ఇవేవీ సాకారంకాకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా పెట్రో ధరలు పెరిగి పరోక్షంగా నిత్యావసర సరుకుల ధరలు మరింత ప్రియమైన పెనుప్రమాదం అలాగే పొంచి ఉంది.

# నేడే అసెంబ్లీ ఎన్నికల సమరం

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో నేడు తొలి దశ పోలింగ్ జరగనుంది. అసెంబ్లీలోని మొత్తం 294 స్థానాలకు గాను 152 సీట్లకు ఎన్నిక జరగనుంది. ఉత్తర బెంగాల్‌లోని 8 జిల్లాలతోపాటు ముర్షిదాబాద్, హుగ్లీ, నడియా, బిర్భూమ్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో విస్తరించి ఉన్న 54 సీట్లు బీజేపీకి కీలకంగా మారాయి. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పోలింగ్‌లో 3.60 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 167 మంది మహిళలు సహా మొత్తం 1,478 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. అత్యంత సమస్యాత్మకంగా గుర్తించిన 8 వేలకు పైగా పోలింగ్ స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈసీ రికార్డు స్థాయిలో 2,450 కంపెనీల బలగాలను మోహరించింది. వీరితోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దించింది. వరుసగా రెండోసారి విజయం దక్కించుకోవాలని ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్... ఐదేళ్ల క్రితం దూరమైన అధికారాన్ని తిరిగి హస్తగతం చేసుకోవడానికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి... తొలి పోటీలోనే సత్తా చాటాలని సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు దళపతి విజయ్ తహతహలాడుతున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరానికి రంగం సిద్ధమయ్యింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 234 స్థానాల్లో ఒకే విడతలో జరిగే ఓటింగ్‌లో 5.73 కోట్ల మంది ఓటర్లు 4,023 మంది అభ్యర్థుల తలరాతలను నిర్దేశించబోతున్నారు. ప్రధానంగా డీఎంకే, అన్నాడీఎంకే కూటముల మధ్యే పోటీ నెలకొన్నప్పటికీ విజయ్ నేతృత్వంలోని తమిళగ వేట్రి కళగం(టీవీకే) గణనీయమైన ప్రభావం చూపడం తథ్యమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# విద్యార్థిని మృతితో విషాదం... కుటుంబానికి అండగా నిలిచిన గురువులు



విజ్ఞాన దినపత్రిక, మణికుమార్, కారంపూడి (ఏప్రిల్: 23) కారంపూడి పట్టణంలో భవిత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని బాధరబోయిన నాగలక్ష్మి అనారోగ్య కారణాలతో మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. చిన్నారి మృతితో ఆమె కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ దుస్థితిని గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. నాగలక్ష్మి కుటుంబానికి అండగా నిలుస్తూ రెండు నెలలకు సరిపడా బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సహాయం ఎంఈఓ -1 అనిల్ కుమార్, ఎంఈఓ-2 రవికుమార్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల(మెయిన్ ) ప్రధానోపాధ్యాయురాలు పుల్లమ్మ,, భవిత పాఠశాల ఉపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయుడు మల్లికార్జున, రాధాకృష్ణమూర్తి, మాన్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఆయా పాఠశాలల సిబ్బంది కలిసి నెల సరుకులను సమీకరించి అందించడం ప్రత్యేకంగా నిలిచింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఇలాంటి కష్టసమయంలో ఉపాధ్యాయులు ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. చిన్నారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి ధైర్యం కలగాలని ఉపాధ్యాయు లు కోరుకున్నారు.

# శ్రీశైలం ఘాట్‌లో అదుపు తప్పిన బస్సులు..తప్పిన పెను ప్రమాదం

-లోయలోకి దూసుకెళ్లి బస్సు బోల్తా.. ప్రయాణికులకు గాయాలు



దోర్నాల: ఏప్రిల్ 22: రెయిలింగ్‌ను ఢీకొట్టి నిలిచిన మరో బస్సు. మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం నుంచిదోర్నాల వైపు వస్తోంది. ఘాట్‌రోడ్డులో ఎదురొచ్చిన వాహనాలకు సైడిచ్చే క్రమంలో రోడ్డు మార్జిన్ దిగిం ది. అప్పటికే అక్కడ వర్షపు జల్లులుపడుతుండటంతోపాటు వేగం కారణంగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఇనుప రిటైనింగ్ వాల్‌ను దాటి లోయలోకి దూసుకెళ్లింది. అందులో ఉన్న 30మంది భయాందోళనతో కేకలు వేశారు. అయితే, ఆ ప్రాంతంలో పెద్ద పెద్ద చెట్లు ఉండడంతో వాటిని ఢీకొట్టి బస్సు నిలిచిపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అదే సమయంలో ఆ బస్సు వెనుకవస్తున్న ఇంద్ర బస్సు కూడా వేగం అదుపు కాక రోడ్డు పక్కన ఉన్న రక్షణ ఇనుప కమ్మీలను ఢీకొట్టి నిలిచిపోయింది. అందులో ఉన్న 12 మంది భయాందోళనకు గురయ్యారు..

# కడపలో విషాదం

**నిశ్చితార్థం తర్వాత యువతి ఆత్మహత్య.**



కడప క్రైమ్ ఏప్రిల్ 22: కాబోయే హస్బెండ్ మాటలతో మనస్తాపం. ''నువ్వంటే ఇష్టం లేదు'' అంటూ యువకుడి వ్యాఖ్యలు. ''నాకు నలుగురు గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారు" అని షాక్ ఇచ్చిన వరుడు. మొదట సరదాగా తీసుకున్న యువతి. పదేపదే అదే మాటలు చెప్పడంతో తీవ్ర నిరాశ. గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్న రెహానా (26). ఎమ్మెస్సీ పూర్తి చేసి,గవర్నర్ చేతుల మీదుగా పట్టా పొందిన యువతి. ఫిబ్రవరి 15న నిశ్చితార్థం జరిగిన జంట. బెంగళూరులో ఐటీ ఉద్యోగి షాజహాన్‌తో పెళ్లి నిశ్చయం. సూసైడ్ నోట్ స్వాధీనం. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు. చిన్నచౌకు పోలీసులు దర్యాప్తు ప్రారంభం. "సంబంధాల్లో మాటల ప్రభావం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది"..

# ఆరంభం

ప్రపంచానికి వెలుగునిచ్చే
సూర్య భగవానుడికే ఒక్కోసారి
గ్రహణం పడుతుంది కదా!
వెలుగు రాకుండానే
చీకటి మొత్తం కమ్మేస్తుంది
అలాంటిది ఒక సామాన్య
సాదా సీదా మనుషులం
మనకు కష్టం రావడంలో
ఆశ్చర్యమేముంది?
చీకటిని చీల్చుకొని సూర్యుడెలా
లక్ష్యల రెట్లు ప్రకాశిస్తాడో
మనిషి కష్టాలను దాటుకొని
అంతకంటే కోటి రెట్లుగా
నువ్వు ఎదిగి చూపించాలి
వచ్చి పోయే ఆచీకటి
కష్టం రెండూ శాశ్వతం కాదు
మన సంకల్పం బలంగా ఉంటే
చీకటి కూడా దారి ఇస్తుంది
మధ్యలో వదిలేయడానికి కాదు
ప్రయాణం మొదలు పెట్టింది
అసాధ్యం అనే పదం బలహీనుల
నిఘంటువులో ఉంటుందే కానీ
సాధ్యం అనేది మాత్రమే
విజేతలకు తెలిసిన పదం
నీలో మొండి పట్టుదల ఉంటే
ఆకాశమే హద్దు కాదు
అది ఒక ఆరంభం మాత్రమే
జీవితం నీది బ్రతుకు నీదే
పోరాడు గెలిచితీరుతావు!



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

# " రఘు నూరు సరాలు " పుస్తకావిష్కరణ



పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు లోని మినీ టౌనుహాలు నందు డాక్టర్ రాచపాళెం రఘు రచించిన "రఘు నూరు సరాలు" పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. పద్య కళాపరిషత్ అధ్యక్షులు కీర్తి శేషులు మెట్టు రామచంద్ర ప్రసాద్ స్మారకార్థం ఆయనకు ఈ పుస్తకాన్ని అంకితం చేశారు. ముందుగా మెట్టు రామచంద్ర ప్రసాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశనాయకుల, చరిత్రకారుల చిత్రపటాల ప్రదర్శన జరిగింది. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సెంట్రల్ జి.ఎస్.టి. అసిస్టెంట్ కమీషనర్ డాక్టర్ సి. హెచ్. ఉషా కిరణ్, నెల్లూరు జిల్లా క్రైం రికార్డ్స్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.రామారావు, పుస్తక సమీక్షకులు డాక్టర్ కె.లక్ష్మీ నారాయణ రెడ్డి, ఎ.జయప్రకాశ్, షేక్ రియాజ్ బాషా, మెట్టు స్వరాజ్య లక్ష్మి, ఎన్.బాలరామయ్య నాయుడు, శింగంశెట్టి మురళీమోహన్ రావు, మురళీమోహన్ రాజు, రచయిత డాక్టర్ రాచపాళెం రఘు, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు యువతరం చేతిలో ఉంది : ఆత్మకూరు సీఐ గంగాధర్



**-బాబు ఏసిపోగు విజ్ఞాన దిన పత్రిక రిపోర్టర్ ఆత్మకూరు** ఆత్మకూరు పట్టణం నెల్లూరు పాలెం సమీపంలో లో గల ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల చే ర్యాలీ అవగాహనా కార్యక్రమం నిర్వవించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. గంగాధర్ మాట్లాడుతూ..సమాజంలో చెడు వ్యసనాలు దేశ భవిష్యత్తుకు అడ్డంకిగా మారిందని,యువత వ్యసనాలకు బానిసలు అయితే అది వారి కుటుంబంతోపాటు దేశ అభివృద్ధిని చిన్నాభిన్నం చేస్తుందని సీఐ గంగాధర్ తెలిపారు.. మాదకద్రవ్యాలను అరికట్టడం అసాంఘిక కార్యక్రమాలు నిరోధించడం పై నెల్లూరు పాలెం సమీపంలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజ్ ప్రాంగణంలో కాలేజ్ విద్యార్థులచే ప్రమాణ స్వీకారం చేయించారు. మొదట కాలేజ్ ప్రాంగణం వద్ద విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐ గంగాధర్ మాదకద్రవ్యాలను, గంజాయి, డ్రగ్స్ వాటి వల్ల సమాజంలో ఎదురవుతున్న ఇబ్బందులను వాటి ప్రభావంతో చెడిపోతున్న యువత భవిష్యత్తు గురించి వివరించారు.. అనంతరం దేశ భవిష్యత్తు కోసం తల్లిదండ్రుల గౌరవం కోసం మత్తు పదార్థాలు ఇతర చెడు వ్యసనాల జోలికి వెళ్ళనని విద్యార్థుల చేత ప్రమాణస్వీకారం చేయించారు...ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ గోవర్ధన్, మండల సిసి విజయలక్ష్మి,ఇస్వాస్ సంస్థ అధ్యక్షులు బుర్ర శేషాద్రి కాలేజీ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు..

# ఆత్మకూరులో ఉవ్వెత్తున ఎగిసిన నిరసన జ్వాల

**తిప్ప పోరంబోకు ఇళ్లకు పట్టాలివ్వాలని డిమాండ్**
**మున్సిపల్ అధికారుల తీరుపై సిపిఎం ఆగ్రహం**
**ఆర్డీవో కార్యాలయం ముట్టడి.. వినతి పత్రం అందజేత**



**బాబు ఏసిపోగు విజ్ఞాన పత్రిక రిపోర్టర్ ఆత్మకూరు** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఉద్రిక్తత నెలకొంది. తిప్ప పోరంబోకు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న నిరుపేదలకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ బస్టాండ్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. పట్టణంలోని 12 నుంచి 19 వరకు గల వివిధ వార్డుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజలు దశాబ్దాలుగా తిప్ప పోరంబోకు భూముల్లో నివాసం ఉంటున్నారు. వీరందరికీ ప్రభుత్వం తక్షణమే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం కాలనీలకు రూ. 50 మాత్రమే ఇంటి పన్ను వసూలు చేయాల్సి ఉండగా, మున్సిపల్ అధికారులు ఒక్కో ఇంటికి రూ. 3,000 నుండి రూ. 4,000 వరకు వసూలు చేస్తున్నారని నేతలు మండిపడ్డారు. ఆత్మకూరు గ్రేడ్-3 మున్సిపాలిటీ అయినప్పటికీ, అధికారులు మాత్రం గ్రేడ్-1 స్థాయి పన్నులను అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పన్నులు కట్టించుకోవడానికి లేని అభ్యంతరం, పట్టాలు ఇవ్వడానికి వచ్చేసరికి "వాగు పోరంబోకు" అంటూ కొర్రీలు పెట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "పేద ప్రజలను వేధించడం మానుకోవాలి. పన్నులు వసూలు చేసేటప్పుడు లేని నిబంధనలు, పట్టాలు అడిగితేనే ఎందుకు గుర్తుకొస్తున్నాయి? వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు ఇవ్వాలి, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తాం."అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం సిపిఎం నాయకులు ఆర్డీవోను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు,సిఐటియు జిల్లా నాయకులు శివయ్య, సిపిఎం కమిటీ సభ్యులు నాగయ్య, నాగేంద్ర, గుల్జార్ మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పోలిశెట్టి బుజ్జమ్మ 2 వ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు పోలిశెట్టి శ్రీనివాసులు ముంగుమూరు ఆదరణ కేంద్రంలో టీవీ బహూకరణ



బి ఎం ఆర్ యువసేన అధ్యక్షులు సమీఉల్లా మాట్లాడుతూ పోలిశెట్టి శ్రీనివాసులు గారు వారి తల్లి బుజ్జమ్మ గారి రెండవ వర్ధంతి సందర్భంగా ముంగమూరు ఆదరణ కేంద్రంలో అక్కడ సభ్యుల కోరిక మేరకు టీవీ బహూకరించడం జరిగింది అంతేకాదు గతం లో కూడా పోలిశెట్టి శ్రీనివాసరావు గారు ముంగుముడు ఆదరణ కేంద్రంలో చాలా చాలా సేవా కార్యక్రమాలు చేసినారు ఇంకా రాబోయే రోజుల్లో కూడా ఆయన ఇంకా చాలా సేవా కార్యక్రమాలు ముంగమూరు ఆదరణ కేంద్రంలోని ఇంకా ఎక్కడైనా పేద ప్రజలు ఉంటే వాళ్లకి కూడా సాయం చేస్తారని హామీ ఇచ్చినారు ఈ కార్యక్రమంలో ఆదరణ డైరెక్టర్లు సింహాద్రి భవాని గారు వెంకటేశ్వర్లు రాము మసూద్ తదితరులు పాల్గొన్నారు

# అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి ధ్యానకు 12,700 రూ సాయం అందజేసిన సంయుక్త సేవా సంస్థ



నెల్లూరు జిల్లా బోగోలులో నివాసం ఉంటున్న 11 సంవత్సరాల చిన్నారి ఎం ఆర్ ధ్యాన పల్మనేరి హైపో టెన్షన్ వ్యాధితో బాధపడుతూ ఆక్సిజన్ మీదే ఆధారపడి జీవిస్తూ ఉంది. చిన్నారికి అత్యవసరంగా ఆక్సిజన్ మిషన్ అవసరమై ఉన్నందున సంయుక్త సేవా సంస్థ ద్వారా చిన్నారి తండ్రి అశోక్ కుమార్ చేతికి 12,700 రూ ఆర్థిక సహాయాన్ని నేడు కావలి పట్టణంలోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ చిన్నారి తండ్రి అశోక్ కుమార్ తన కుమార్తె చిన్నారి ధ్యాన పల్మనేరి హైపో టెన్షన్ వ్యాధితో బాధపడుతూ ఉందని ,నిరంతరం ఆక్సిజన్ మీదే ఆధారపడి జీవిస్తూ ఉందని. ప్రస్తుతం వారి దగ్గర ఉన్న ఆక్సిజన్ మిషన్ సక్రమంగా పనిచేయక పోవడంతో చిన్నారికి ఆక్సిజన్ అందక ఇబ్బంది పడుతూ ఉందని తెలిపారు.సంయుక్త సేవా సంస్థ ద్వారా ఆక్సిజన్ మిషన్ సహాయం చేయమని కోరడంతో ఈ విషయాన్ని తాము యొక్క సంస్థ సభ్యుల దృష్టికి తీసుకొని వెళ్ళిన వెంటనే స్పందించి 12,700 రూపాయలు అందజేసి దాతృత్వం చాటుకున్న కె శ్రీనివాసరావు, కె సాయి చైతన్య, మార్టూరు పరమేశ్వరి , వి శ్రీనివాసరావు ,నేలపాటి వెంకటరమేష్ , వాకాటి మహేంద్ర - శ్రీదేవి, సుధాకర్ - విశాలాక్షి దంపతుల, జి శాంతి వర్ధన్, అళహరి రామకృష్ణ,జి లిఖిత కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. చిన్నారి తండ్రి అశోక్ కుమార్ మాట్లాడుతూ తన కుమార్తె ఆరోగ్యం గురించి తెలియజేసిన వెంటనే స్పందించి 12,700 రూ అందజేసి తమకు అండగా నిలిచిన సంయుక్త సేవా సంస్థ సభ్యులకు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్రకు ధన్యవాదాలు తెలిపారు. తన బిడ్డకు ఆక్సిజన్ అందక ఇబ్బంది పడుతోందని, ప్రస్తుతం వారి దగ్గర ఉన్న ఆక్సిజన్ మిషన్ సక్రమంగా పనిచేయక అవస్థలు పడుతున్నామని,మరో ఆక్సిజన్ మిషన్ కొనుక్కునే స్తోమత లేదని మనసున్న దాతలు ముందుకు వచ్చి నగదు రూపంలో కాకుండా వస్తు రూపంలో ఒక ఆక్సిజన్ మిషన్ సహాయం చేయమని కోరారు.

# కార్డన్ సెర్చ్ నిర్వహించిన సిఐ కోటేశ్వరరావు

**-ఆకాతాయి లు తోక జాడిస్తే తాట తీస్తా**



**నెల్లూరు సిటీ.. ఏప్రియల్ 21/(విజ్ఞాన్ ప్రతి నిది ).** అసాంఘిక శక్తులకార్యకలాపాలనియంత్రణ లో భాగంగా కార్డెన్ సర్చ్ వాహనాల వాహనాల తనిఖీ కోటమిట్ట ప్రాంతం లో చేయడం జరిగిందని చిన్న బజారు పోలీస్ స్టేషన్ సిఐ చిట్టెం కోటేశ్వరరావు పేర్కొన్నారు, బుధవారం కోటమిట్ట మెకలైన్స్ రోడ్డు ఆనం వెంకటరెడ్డి కాలనీ కోటమిట్ట ప్రధాన రహదారి వీదులో ని అన్ని వాహనాలను క్షుణంగా తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు..... ఈ సందర్భంగా సిఐ మాట్లాడు తూ ఈ ప్రాంతం లో రౌడి షీటర్ల ఆగడాల కు కళ్లెం వేశామని కొందరి పై పీడీ యాక్ట్ నమోదు చేశామని తెలిపారు... ఆకాతాయి చేష్టలు చెస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.. అలాగే యువత గంజాయి మాధాకద్రవ్యలకు దూరంగా గా ఉండాలని యువత కు తెలిపారు అలాగే తల్లి దండ్రులు పిల్లల నడవడిక పై శ్రద్ధ తీసుకోని మంచి ప్రవర్తన తో మెలిగేల చూసుకోవాలని తెలిపారు.... తనిఖీలు రాత్రి గస్తీ ముమ్మరం గా ఉంటుందని తెలిపారు.. ఈ కార్యక్రమం లో ఎస్ ఐ లు మహబూబాబ్ బాషా, అబ్దుల్ రాజాక్,లు పాల్గొన్నారు...

# "సర్వాయపాలెం జడ్పీ హైస్కూల్లో ఘనంగా మీర్జా సమీర్ వీడ్కోలు సభ"



కావలి మండలంలోని సర్వాయపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తోట. వెంకటేశ్వర్లు అధ్యక్షతన 'ఆఫీస్ సబార్డినేట్ ' గా విధులు నిర్వహిస్తున్న మీర్జా సమీర్ "టైపిస్టు" గా పదోన్నతి పొంది బోగోలు ఎం.డి.ఓ. కార్యాలయంకు బదిలీ అయిన సందర్భంగా పాఠశాల ఆవరణలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తోట. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మీర్జా సమీర్ పాఠశాల అభివృద్ధిలో మరియు పరిపాలనాపరమైన పనులలో అందించిన సేవలు ఎంతో విలువైనవని, అతని క్రమశిక్షణ, అంకిత భావం తోటి సిబ్బందికి ఆదర్శనీయమని పేర్కొన్నారు. అదేవిధంగా వృత్తిరీత్యా పదోన్నతి పొందడం సంతోషకరమని, సమీర్ తన కొత్త బాధ్యతల్లో కూడా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం పదోన్నత పొంది వెళ్తున్న సమీర్ కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు బోధనేతర సిబ్బంది శాలువా కప్పి, పూల మాలలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. సన్మాన గ్రహీత మీర్జా సమీర్ తనకు సహకరించిన ప్రధానోపాధ్యాయులుకు, ఉపాధ్యాయులుకు మరియు సోదర బోధనేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు తోట. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పి. రమేష్, జి. రాములు, సి.హెచ్. చెంచయ్య, పి. సువర్ణలక్ష్మి, పి. శివరామయ్య, యు. విజయలక్ష్మి, ఎం. అరుణకుమారి, పి. ఫిరోజ్ ఖాన్, జి. అనిత, వి. సరళ, కె.వి. రత్నం, డి. సుబ్బారావు, సి.హెచ్. అన్నపూర్ణ, మధు బోధనేతర సిబ్బంది అలహరి. సాయికుమార్, ఐ. కిరణ్ కుమార్, టి.వి. రమణయ్య, బి. పద్మ పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్లి పోలీస్ గా పనిచేయండి : డి.ఎస్.పి వి వి రమణ కుమార్



**కావలి, విజ్ఞాన్ పత్రిక:** నూతన డిఎస్పి వి వి రమణ కుమార్ బుధవారం నాడు కావలి ఒకటవ, రెండవ పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లను సందర్శించారు. అధికారుల సిబ్బందితో కలిసి మాట్లాడి తగు సూచనలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రజలకు త్వరగా వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెండింగ్లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ లా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.లి

# 28వ వార్డ్ టీడీపీ నాయకులు అచ్చుత శ్రీకాంత్ కి శస్త్ర చికిత్స.

**అవును......మన కావలి ఎమ్మెల్యేది ఎముకలేని చేయి.**



కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిది ఎవరికైనా సాయం చేయడంలో ఎముక లేని చేయి అని మరోసారి తన దాత్రుత్వం ప్రదర్శించిన వైనం ఇది కావలి పట్టణం 28 వ వార్డ్ అచ్యుత్ శ్రీకాంత్ అనే టిడిపి80వ బూత్ ఇంచార్జ్ ప్రమాదవశాత్తు గాయపడి చేతికి ఆపరేషన్ చేయడంజరిగింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే తన ఎముక లేని చెయ్యి అంశాన్ని మరోసారి చాటుకున్నారు. అతను శస్త్ర చికిత్స చేయించుకుంటున్న కావలికి చెందిన ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు ప్రవీణ్ కు ఫోన్ చేసి ఆపరేషన్ ఖర్చు అంతా తనదేనంటూ హామీ ఇచ్చారు ఈ విషయం తెలుసుకొన్న కావలి వాసవి క్లబ్ సేవన్ లైన్స్ ప్రతినిధులు అచ్చు శ్రీకాంత్ ని కలిసి పరామర్శించి ధైర్యం చెప్పడం జరిగింది.

# ముస్లిం విద్యార్దులకు కార్పొరేట్ విద్యకు అయ్యే ఖర్చు భరించేందుకు బోర్డ్ అంగీకారం.

**అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 14 వ వక్ఫ్ బోర్డ్ సమావేశం.**
**ప్రవేశపెట్టిన అజెండాల పై ఏకగ్రీవ తీర్మానం.**
**ఏటా 500 మందికి ఉచిత విద్య. మొదటి ఏడాది 250 మందికి రెండవ ఏడాది నుంచి 500 మందికి.**
**తాలిం ఏ హునర్ పేరు తోనే విద్యా పథకం.**
**- షేక్. అబ్దుల్ అజీజ్, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్.**



విజయవాడలోని కాళేశ్వర రావు మార్కెట్ వద్ద గల ఏపీ వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 14 వ బోర్డ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన అజెండా లపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలు మ్యానేజింగ్ కమిటీలు, పలు ముతవల్లీలను నియమించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, ఏపీ వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా 500 మంది ముస్లిం విద్యార్ధులకు నాణ్యమైన ఉన్నత కార్పొరేట్ విద్యను అందించేందుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ట్యాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపిక చేసిన విద్యార్థులకు ఉచిత ఇంటర్మీడియట్ రెసిడెన్షియల్ విద్య అందించేందుకు దానికి అయ్యే ఖర్చును పూర్తిగా వక్ఫ్ బోర్డు భరించే విధంగా బోర్డు సమావేశం లో తీర్మనించామని తెలిపారు. ప్రత్యేకంగా నిర్వహించిన ట్యాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపికైన ప్రతిభావంతులైన విద్యార్ధులకు ఈ పథకం వర్తిస్తుందని నిర్ణయించారు. ఇంటర్మీడియట్ విద్య తో పాటు జే ఈ ఈ మైన్స్, నీట్ కొరకు శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ చర్యతో ముస్లిం విద్యార్థుల ఉన్నత విద్యకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. మొదటి ఏడాది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి గాను 250 మందికి ఉచిత రెసిడెన్షియల్ కార్పొరేట్ విద్య ను అందిస్తామని రెండవ ఏడాది నుంచి ఏటా 500 మందికి ఉచిత విద్యను అందిస్తామని తెలిపారు. పదవ తరగతి ఫలితాలు విడుదలైన అనంతరం వచ్చే నెలలో ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించి పథకాన్ని ప్రారంభస్తామని తెలిపారు. ఇప్పటికే తాలీం ఏ హునర్ పేరుతో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు నిర్వహిస్తున్నామని అదే పేరుతో విద్యా పథకం కూడా కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో బోర్డ్ సభ్యులైన శాసనమండలి సభ్యులు మొహమ్మద్ రుహుల్లా, శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్, ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, దావూద్ భాషా బఖావి, బేపారి జాకీర్ అహమద్ సీఈఓ యాఖుబ్ ఖాజీ, వక్ఫ్ అధికారులు పాల్గొన్నారు.

# కలిగిరిలో విపిఆర్ నేత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల దంపతులు..!

**-4 నెలల్లో 39,668 మందికి కంటి పరీక్షలు- 22,231 మందికి ఉచిత కళ్లజోడుల పంపిణీ..!**
**-వేలాది కుటుంబాలలో వెలుగులు నింపిన విపిఆర్ నేత్ర..!**
**-ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం..!**



**కలిగిరి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 22** కలిగిరి మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "విపిఆర్ నేత్ర" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ , కాకర్ల ప్రవీణ హాజరై కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి విస్తృతంగా చర్యలు చేపట్టామని తెలిపారు. గత మూడు నెలల కాలంలో నియోజకవర్గంలోని 143 పంచాయితీలకు గాను 126 పంచాయితీలలో నేత్ర శిబిరాలు నిర్వహించి, మొత్తం 39,668 మంది ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అందులో 22,231 మందికి ఉచితంగా కళ్లజోడులను పంపిణీ చేయడం ద్వారా వారి జీవితాలలో కొత్త వెలుగులు నింపామని పేర్కొన్నారు. విపిఆర్ నేత్ర" కార్యక్రమం వేలాది కుటుంబాలకు చూపు మాత్రమే కాకుండా ఆశలను కూడా అందించిన ఒక గొప్ప ఆరోగ్య యజ్ఞంగా నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, విపిఆర్ నేత్ర రథం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రజలకు సమగ్ర నేత్ర వైద్య సేవలు అందించడం ఎంతో ప్రశంసనీయం అని తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కి ఉదయగిరి నియోజకవర్గ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాకుండా విపిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వికలాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ, ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక సహాయం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సహకారం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలు పొందుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

# గత ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం.. కూటమి పాలనలో అభివృద్ధి పనుల వేగం

**- కోవూరులో లో 2. కోట్ల 75 లక్షలతో వోల్టేజీ సమస్యకు చెక్.**
**- రికార్డు స్థాయిలో 56 సి.సి రోడ్ల నిర్మాణం..**
**- జవీ=ఖీ ద్వారా అనారోగ్య బాధితులకు 72 లక్షల 90 వేల ఆర్థిక సహాయం.**
**- కోవూరు 3 వ వార్డు పర్యటనలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.**



ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు పంచాయతీలోని 3 వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప, గత ఐదేళ్లలో కోవూరు పట్టణాభివృద్ధి అడుగు కూడా ముందుకు పడలేదని మండిపడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 22 నెలల కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కోవూరు అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు ఆమె వివరించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ మరియు జిల్లా పరిషత్ గ్రాంట్ల కింద సుమారు 1 కోట్ల79 లక్షలు వెచ్చించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపామన్నారు. ఎంపీ బీదా మస్తాన్ రావు నిధులు 50 లక్షల రూపాయల ఎంపి లాడ్స్ నిధులతో పీటర్ కెనాల్ వంతెన నిర్మాణం, ఎఫ్.డి.ఆర్ నిధులతో చెరువు కట్టల బలోపేతం, కాలువల పూడికతీత మరియు కల్వర్టుల నిర్మాణం కోసం దాదాపు 1 కోటి 50 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ లో-వోల్టేజీ సమస్య నివారణకు 15 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మార్పిడి మరియు ఆర్.డి.ఎస్.ఎస్ పనుల కోసం మొత్తం 2 కోట్ల 75 లక్షలు వినియోగించినట్లు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వివరించారు. పంచాయతీ రాజ్ విభాగం ద్వారా జరిగిన ప్రగతిని వివరిస్తూ.. విలేజ్ హెల్త్ సెంటర్లు, కోర్టు భవనాలు, రీడింగ్ రూమ్ లతో పాటు ఉపాధి హామీ మరియు సాధారణ నిధులతో రికార్డు స్థాయిలో 2 కోట్ల80 లక్షలతో 56 సి.సి రోడ్లను నిర్మించామన్నారు. సామాజిక బాధ్యతగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 61 మంది లబ్దిదారులకు 72 లక్షల 90 వేల విలువైన చెక్కులను అందించినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే కోవూరు సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు తెలుగుదేశం, బిజెపి, జనసేన ముఖ్య పాటు నాయకులతో పెద్ద సంఖ్యలో కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

# బుచ్చిరెడ్డి పాలెంలో టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని భగత్ సింగ్ కట్ట, రెయిన్బో స్కూల్ వీధికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త బత్తిన శ్రీనివాసులు - యమున దంపతుల కుమారుడు బత్తిన సుజయ్ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. విషయం తెలియగానే కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హుటాహుటిన బుచ్చిరెడ్డి పాలెం చేరుకున్నారు. శ్రీనివాసులు నివాసానికి వెళ్లి సుజయ్ మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుమారుడి మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న బత్తిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చిన్న వయసులోనే కుమారుడు మృతి చెందడం అత్యంత బాధాకరమని పార్టీ పరంగా మరియు వ్యక్తిగతంగా ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి భరోసా ఇచ్చారు.

# యేట్రింతల వెంకట సుబ్బయ్య ఉత్తర క్రియలలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల..!



**కావలి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 22** కావలి పట్టణంలో యేట్రింతల వెంకట సుబ్బయ్య పెదకర్మ కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ , కాకర్ల ప్రవీణ పాల్గొని యేట్రింతల వెంకట సుబ్బయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి,తమ ప్రగాఢమైన సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేసి, ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే , వారికి ధైర్యం చెప్పి ఈ క్లిష్ట సమయంలో మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. కుటుంబ సభ్యుల బాధను పంచుకుంటూ, తాము ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. యేట్రింతల వెంకట సుబ్బయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని ఆ భగవంతుని మనసారా ప్రార్థించారు.

# ఏఐటీయూసీ 18వరాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి : జిల్లా అధ్యక్షులు ప్రభాకర్

**కందుకూరు:** ఈ నెల 26న తిరుపతిలో జరుగుతున్న ఏఐటీయూసీ 18వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ కోరారు. బుధవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఈనెల 26 నుండి 28 వరకు తిరుపతిలో రాష్ట్ర 18వ మహాసభలు జరుగుతున్నాయని ఈ మహాసభలో కేంద్ర ప్రభుత్వం కార్మికులపై తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లకు పరిష్కార మార్గంగా కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఏఐటీయూసీ పోరాడి సాధించిన కార్మిక హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం అనేక చట్టాలను నిర్వీర్యం చేస్తుందని దానిని అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. రాష్ట్ర మహాసభలకు జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారని, కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారానికి మార్గదర్శకాలు చేయడం జరుగుతుందని, ఈ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ నాయకులు కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, శ్రామికులు అధిక సంఖ్యలో విరివిరిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కందుకూరు మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి మహాసభల అనంతరం కార్యాచరణ రూపుదిద్దుకొని ఉద్యమం చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కొండేపి నియోజకవర్గ కార్యదర్శి లక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి యర్రంశెట్టి ఆనందమోహన్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కాకుమాని రవణమ్మ, జిల్లా నాయకులు నత్త రామారావు, నాగరాజు, పులి నాగేశ్వరరావు, ఏఐటీయూసీ అనుబంధ స్కందపురి పెయింట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జమ్మలమడుగు రవి, స్వర్ణకారుల సంఘం నాయకులు బొల్లోజుల బాల బ్రహ్మచారి, మున్సిపల్ కార్మికులు జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే అవగాహన కార్యక్రమం



**కావలి (విజ్ఞాన్ రిపోర్టర్ ) ఏప్రిల్ 22** దగదర్తి ఉలవపాళ్ళ జాతీయ రహదారి వద్ద సిఐ ఏ శివశంకర్ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న బల్లను ఆపి వారికి హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల వచ్చే ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ప్రమాదవశాత్తు ఏమైనా జరిగితే మీపై ఆధారపడేకుటుంబాలు ఇబ్బంది పడతారని హెల్మెట్ పెట్టుకుని వాహనాలు నడపడం వల్ల ప్రమాద వశాత్తు కింద పడ్డ తలకి గాయాలు కాకుండా బయటపడతారని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్సై జాంపని కుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు

# మహిళలను ఆర్థికంగా బలోపేతమే చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- స్వయం సహాయక సంఘాల విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు 1 కోటి 60 లక్షలు విలువ చేసే 185 5జి స్మార్ట్ ఫోన్ల అందజేత.**
**- నాడు చంద్రబాబు నాయుడు వేసిన డ్వాక్రా అనే బీజం నేడు మహావృక్షమై కోట్లాది మంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.**
**- 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు రికార్డు స్థాయిలో 291 కోట్ల 7 లక్షల రుణ సహాయాన్ని అందించాం.**
**- ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు. : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



రాష్ట్రంలో మహిళా సాధికారతకు ఆద్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారేనన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి . కోవూరు పట్టణంలోని పివిఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు 5జి మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మహిళలకు స్ఫూర్తినిచ్చే వెలుగు ప్రార్థనా గీతంతో మొదలైన ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని 185 మంది విఓఎలకు అధునాతన 5+ స్మార్ట్‌ఫోన్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వేసిన డ్వాక్రా అనే బీజం నేడు మహావృక్షమై రాష్ట్రంలోని కోట్లాది మంది ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపుతోందని కొనియాడారు. కుటుంబ నిర్వహణ మరియు పొదుపు చేయడంలో మహిళల నేర్పు ఓర్పుల గురించి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వివరించారు. మహిళలను ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే చంద్రబాబు నాయుడు కే దక్కుతుందన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, బుచ్చిరెడ్డి పాలెం మండలాలలో 5 వేల 885 స్వయం సహాయక సంఘాల్లోని 59 వేల 460 మంది మహిళా సభ్యులను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీ మరియు జ×ఖీ వంటి వివిధ పథకాల ద్వారా నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 291 కోట్ల 7 లక్షల రుణ సహాయాన్ని అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కి కోవూరు నియోజకవర్గ ప్రజానీకం తరుపున ధన్యవాదాలు తెలియ చేసారు. చంద్రబాబు నాయుడు డిజిటల్ విజన్‌లో భాగంగానే ఈరోజు వీఓఏలకు 5+ మొబైల్స్ అందజేస్తున్నామని దీనివల్ల క్షేత్రస్థాయిలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. ఇకపై రికార్డుల నిర్వహణ కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదని, హైస్పీడ్ ఇంటర్నెట్‌తో నిమిషాల్లో వివరాలను ఆన్‌లైన్ చేయవచ్చని చెప్పారు. రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా అవినీతికి తావులేకుండా పారదర్శకత పెరుగుతుందని అలాగే మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెట్లలో ప్రదర్శించడానికి ఈ ఫోన్లు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. ప్రభుత్వ నిర్ణయాలు మరియు కొత్త జీవోలు వాట్సాప్ లేదా ప్రత్యేక యాప్‌ల ద్వారా నేరుగా సెకన్ల వ్యవధిలో ప్రతి సభ్యురాలికి చేరుతాయని తద్వారా సమాచార లోపం లేకుండా ప్రతి మహిళా సాధికారత సాధనలో భాగస్వామి అవుతుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేసారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళా సంఘాల పనితీరులో వేగం, పారదర్శకత పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం 5+ స్మార్ట్ ఫోన్లు అందచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందనన్నారు. అనంతరం డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజ కుమారి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల పురోగతి వివరించారు. ప్రభుత్వం యిచ్చే రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు మధుసూదన్, మురళి ఎంపీడీఓ శ్రీహరి, కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఎపిఎంలు. విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లతో పాటు స్థానిక టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buldings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.